RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 248 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 3-4-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :248 | 3-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-





## అమరావతి బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### ఇక అమరావతికి తిరుగులేదు.. రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది


### రాజ్యసభలో అమరావతి రాజధాని బిల్లు.. రెండు గంటల పాటు చర్చ

### అమరావతి రైతులదే విజయం: రాజ్యసభలో రేణుకా చౌదరి

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతోఅమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో

తరువాయి 2లో..



### ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల

## విడుదలకు గ్రీన్ సిగ్నల్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ.7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద

తరువాయి 2లో..




## రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

### ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకుందాం: మంత్రి నారా లోకేశ్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన హామీ లభించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమోద ముద్ర వేశాయి. ఈ చారిత్రాత్మక పరిణామం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ విషయంపై




మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (ఀ) వేదికగా స్పందిస్తూ... "రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజారాజధానికి చట్టబద్ధత లభించింది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నేడు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. దీపాలతో సెల్ఫీ తీసుకుని 'మన రాజధాని మన గౌరవం'

తరువాయి 2లో..

## డిజిటల్ జనగణన తొలిదశ ప్రారంభం



**స్వయంగా వివరాలను నమోదుచేసిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని**


**ట్యాబ్‌లో గృహ వివరాలను నమోదు చేస్తున్న మోదీ**

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

జన గణన-2027 తొలి దశలో భాగంగా ఢిల్లీ సహా 8 రాష్ట్రాలు,

తరువాయి 2లో..

## దుస్సాహసానికి పాల్పడితే.. పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్‌ను భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పరోక్షంగా హెచ్చరించారు. ప్రస్తుత

తరువాయి 2లో..

## చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు..

### చరిత్రలో తొలిసారిగా నాసా కీలక నిర్ణయం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) మరో చారిత్రక మార్పుకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో తొలిసారిగా, లోతైన అంతరిక్షంలోకి (డీప్ స్పేస్) వెళ్తున్న తమ వ్యోమగాములకు వ్యక్తిగత ఐఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం నింగిలోకి దూసుకెళ్లిన ఆర్టెమిస్-2 మిషన్‌లో ఈ కొత్త విధానాన్ని

తరువాయి 2లో..



## నామినేషన్లు వేసేటప్పుడు జాగ్రత్త

### కొత్త అధికారులు తిరస్కరించే అవకాశముంది

### అభ్యర్థులకు మమత సూచన



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఎన్నికల సంఘం కొత్తగా నియమించిన ఎన్నికల అధికారులు నామినేషన్లను తిరస్కరించే అవకాశముందని తమ పార్టీ అభ్యర్థులను తృణమూల్ అధినేత మమతా బెనర్జీ హెచ్చరించారు. వాటిని దాఖలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 'ప్రతిదీ మారింది. కొత్త సెటప్ వచ్చింది. కొత్తగా నియమితులైన అధికారులు మీ నామినేషన్లను తిరస్కరించవచ్చు' అని పేర్కొన్నారు. నానూర్, బుర్ద్వాన్‌లలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె మాట్లాడారు. రాజకీయ

తరువాయి 2లో..



## ఎవరెస్ట్‌పై రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేసి..!

### ఎవరెస్ట్‌పై రూ.186 కోట్ల స్కామ్..

### రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేసి..


**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరంగా ప్రఖ్యాతిగాంచిన మౌంట్ ఎవరెస్ట్ పర్వతారోహకులకు సంబంధించిన సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. వారు ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తీసుకొనే ఆహారాన్ని రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేస్తున్నారట. కొందరు ఒక నెట్‌వర్క్‌లా ఏర్పడి.. ఈ కుట్రకు పాల్పడుతున్నారని, అత్యవసర పరిస్థితిని సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని నేపాల్ పోలీసులు అభియోగాలు మోపారు. దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎవరెస్ట్ పర్వతారోహకులు తీసుకొనే ఆహారంలో బేకింగ్ సోడా మోతాదును పెంచుతున్నారు. దాంతో వారు జీర్ణకోశ సమస్యలకు గురవుతున్నారు. అయితే ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయని ట్రెక్కర్లను నమ్మిస్తుంటారు. అప్పుడే

తరువాయి 2లో..

### ప్రజలకు న్యాయ అవగాహన చేరవేయడంలో

## "సిటిజన్ టైమ్స్" కొత్త అడుగు




**సిటిజన్ టైమ్స్ ఎడిటర్**

సమాజానికి ఉపయోగపడే అంశాలను ముందుకు తీసుకువస్తూ, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వస్తున్న "సిటిజన్ టైమ్స్" పత్రిక మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ విశ్లేషణలతో పాటు ప్రజలలో చైతన్యం కలిగించే ప్రత్యేక కథనాలను అందించిన ఈ పత్రిక, ఇకపై న్యాయ అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించనుంది. భారతీయ న్యాయవ్యవస్థలో ఉన్న చట్టాలు, వాటి ప్రాముఖ్యత, సాధారణ ప్రజలకు సంబంధించిన హక్కులు మరియు బాధ్యతలను సులభమైన భాషలో ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పత్రిక యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులతో కలిసి "సిటిజన్ టైమ్స్" లీగల్ టీమ్ పని చేయనుండగా, చట్టాలపై పూర్తి అవగాహన కల్పించే ప్రత్యేక కథనాలు త్వరలో పాఠకుల ముందుకు రానున్నాయి. ఇప్పటివరకు పత్రికకు లభించిన ప్రజాదరణ, ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా మరింత నాణ్యమైన, ఉపయోగకరమైన సమాచారం అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## ఎడిటోరియల్

# ఏపీలో కొత్త రాజకీయం !

వైసీపీ చతికిలపడిన చోటనే కాంగ్రెస్ లేస్తుంది. వైసీపీ తప్పుల తడకల నుంచే కాంగ్రెస్ భవిష్యత్తు నిర్మాణం జరుగుతుంది. వైసీపీని దూషించడం వల్ల అది అయ్యే పని కాదు, విధానపరంగా వైసీపీని ఎదుర్కొంటేనే కాంగ్రెస్ కి మేలు జరుగుతుంది. రాజకీయంగా పోయిన చోటనే వెతుక్కోవాలని అంటారు ఏపీలో కాంగ్రెస్ క్యాడర్ అంతా వైసీపీకి మళ్ళింది. కాంగ్రెస్ ని అభిమానించే సెక్షన్లు కూడా వైసీపీ గూటికి చేరాయి. దాంతో కాంగ్రెస్ ఖాళీ అయిపోయింది. వరసగా మూడు ఎన్నికల్లో దెబ్బతినిపోయింది. డిపాజిట్లకు కూడా ఠికానా లేని పరిస్థితి ఏర్పడింది. అయితే వైసీపీ గ్రాఫ్ అంతకంతకు పెరుగుతూ 2019 నాటికి ఏకంగా 50 శాతం ఓటు షేర్ తో పీక్స్ కి చేరుకుంది. అలా ఆకాశమార్గాన వైసీపీ విహరిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అయితే పాతాళానికి కృంగిపోయి ఉంది. అయితే కాలమెప్పుడూ ఒకేలా ఉండదు కాబట్టి వైసీపీ రెక్కలు తెగి 2024 ఎన్నికల్లో పూర్తిగా నేల మీదకు చేరింది. ఇదే అదనుగా వైసీపీని దెబ్బ తీయాలని కాంగ్రెస్ చూస్తూ వస్తోంది అయితే పీసీసీ చీఫ్ గా వైఎస్ జగన్ సోదరి ఈ అవకాశాన్ని సరిగ్గా వాడుకోలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. ఎక్కడ వైసీపీ లోపాలు ఉన్నాయో వాటిని ఒడిసిపట్టి జనాలకు తమకు దూరమైన సెక్షన్లను తిప్పుకునే నైపుణ్యం అయితే ఏపీ కాంగ్రెస్ చూపించలేకపోతోంది. ఇదిలా ఉంటే అమరావతి రాజధాని అన్నది సెంటిమెంట్ అంశంగా ఉంది. ఈ అంశం మీద అసెంబ్లీ ప్రత్యేక సమావేశం పెట్టి మరీ చట్టబద్ధత కోరుతూ తీర్మానం చేసింది కూటమి ప్రభుత్వం. దానికి వైసీపీ గైర్ హాజరు అయింది. ఇక పార్లమెంట్ లో సైతం వాకౌట్ చేసింది దాంతో అమరావతికి తాము అనుకూలం అంటూనే వైసీపీ ఈ విధంగా వ్యవహరించడం మాత్రం ఆ పార్టీకి రాజకీయంగా ఇబ్బందికరమే అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ చాలా హుందాగా వ్యవహరించింది. ఆ పార్టీ తరఫున లోక్ సభలో మాట్లాడిన ఎంపీ సీనియర్ నేత మాణిక్యం ఠాకూర్ అయితే ప్రత్యేక హోదా విభజన హామీలను కేంద్రానికి గుర్తు చేశారు. అదే సమయంలో అమరావతి రాజధానికి కాంగ్రెస్ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కోస్తా జిల్లాలలో అయితే అమరావతి రాజధాని ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది 2024 ఎన్నికల్లో చూస్తే వైసీపీకి ఇక్కడ ఒక్క సీటూ దక్కలేదు మొత్తానికి మొత్తం కూటమి పార్టీలు ఊడ్చేశాయి. దానికి కారణం రాజధాని విషయంలో వైసీపీ వ్యవహరించిన తీరు అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇపుడు కూడా వైసీపీ అదే రకమైన గందరగళంలో ఉందని అంటున్నారు. అయితే అమరావతి రాజధానికి అవుట్ రేట్ గా మద్దతు ప్రకటించి కాంగ్రెస్ వైసీపీని వెనక్కి నెట్టింది. ఈ పరిణామమే ఇపుడు ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది నిజానికి చూస్తే జాతీయ రాజకీయాల్లో బీజేపీ కాంగ్రెస్ ప్రత్యర్థులుగా ఉన్నాయి. ఢీ అంటే ఢీ కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అయితే బీజేపీని ఇదే అదనుగా ఇరుకున పెట్టవచ్చు, కానీ కాంగ్రెస్ మాత్రం ఏపీ గురించి ఆలోచించింది. రాష్ట్ర ప్రయోజనాలతో పాటు తమ రాజకీయ వ్యూహాలను సరిగ్గా ఇక్కడే అమలు చేసింది. ఇప్పటికే విభజన పాపాలను మోస్తున్న ఆ పార్టీ ఇపుడు వాటిని కడుక్కునే ప్రయత్నం చేసింది. మూడు ఎన్నికల్లో వరసగా ఎటూ జనాలు కాంగ్రెస్ ని శిక్షించారు. ఇపుడు మరో కీలక సెంటిమెంట్ రాజధాని విషయంలో అయినా జనాల మనసు గెలుచుకోవాలని వైసీపీ చూస్తోంది. అయితే ఏపీలో టీడీపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వైసీపీ మాత్రం ఈ విషయంలో రాజకీయంగానే ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఈ క్రమంలో రేపటి రోజున వైసీపీ వీక్ అయిన చోట కాంగ్రెస్ బలపడేందుకు ఎంతవరకూ అవకాశాలు ఉంటాయన్న చర్చకు తెర లేస్తోంది. చిన్న నియోజకవర్గాలు ఎక్కువ సీట్లు 2029 నాటికి అవుతున్న వేళ కాంగ్రెస్ ఈ తరహా వ్యూహాలతో ముందుకు వస్తే కనుక అది వైసీపీకి షాక్ ఇచ్చినా ఇవ్వవచ్చు అని అంటున్నారు.

# 'అమరావతి బిల్లు'కు రాజ్యసభ ఆమోదం

పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

**ఇక అమరావతికి తిరుగులేదు.. రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది: సీఎం చంద్రబాబు**

రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమిష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.

**రాజ్యసభలో అమరావతి రాజధాని బిల్లు.. రెండు గంటల పాటు చర్చ**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై మధ్యాహ్నం 1 గంట నుంచి చర్చ ప్రారంభమవుతుందని రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. చర్చ కోసం రెండు గంటల సమయాన్ని కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. సభ్యులు ఈ సమయంలో బిల్లుపై తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు. అంతకుముందు బుధవారం నాడు ఈ బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మినహా సభలోని మిగతా పార్టీలన్నీ బిల్లుకు మద్దతు పలికాయి. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం, చట్ట రూపం దాల్చేందుకు బిల్లును ఎగువ సభ అయిన రాజ్యసభకు పంపారు. రాజ్యసభ ఆమోదం కూడా లభిస్తే, అమరావతి ఏకైక రాజధానిగా చట్టబద్ధతను సంతరించుకుంటుంది.

**అమరావతి రైతులదే విజయం: రాజ్యసభలో రేణుకా చౌదరి**

ఏపీ రాజధాని బిల్లు అమరావతి రైతుల విజయమని రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి అభివర్ణించారు. గురువారం రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. ఉద్యమ సమయంలో రైతులు, మహిళలను తీవ్రంగా హింసించినా, వారు వెనకడుగు వేయకుండా పోరాటం కొనసాగించారని గుర్తుచేశారు. గత 12 ఏళ్లుగా ఏపీ రాజధానిపై కొనసాగుతున్న అస్పష్టత వల్లే రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయని రేణుకా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారని ఆమె విమర్శించారు. కేవలం బిల్లు పెట్టడమే కాదు, నిర్ణీత సమయంలో రాజధానిని పూర్తి చేసి చూపించాలని డిమాండ్ చేశారు. విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలతో ఆటలు ఆడుతోందని ఆమె మండిపడ్డారు. దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్‌ను ముగిసిన అధ్యాయాలుగా మార్చేశారని విమర్శించారు. తెలంగాణకు హామీ ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలను కూడా కేంద్రం ఇవ్వలేదని తెలిపారు. ఇన్నేళ్లయినా హామీలు ఎందుకు నెరవేర్చలేదో కేంద్రం సమాధానం చెప్పాలని, రెండు రాష్ట్రాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా, లక్షా 47 వేల కోట్ల విలువైన ఆస్తుల పంపకాలు ఇంకా పూర్తి కాలేదని ఆమె గుర్తుచేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్న ఐదు గ్రామాల ప్రజలు తెలంగాణలో ఉండాలని కోరుకుంటున్నా, వారిని ఏపీలో కలపడంతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా, రెండు తెలుగు రాష్ట్రాలు కలిసే ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రేణుకా చౌదరి తన ప్రసంగాన్ని ముగించారు.

### ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల

# విడుదలకు గ్రీన్ సిగ్నల్

రూ.1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ.76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు.

వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ.3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ.223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటీరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ.614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటీరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# ఎవరెస్ట్‌పై రహస్యంగా ఫుడ్ పాయిజన్ చేసి..

వారి భయాన్ని సొమ్ము చేసుకోవడం మొదలవుతుంది. వారిని అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను రప్పిస్తారు. ఎంత డబ్బు అయినా చెల్లించేలా అప్పటికే బాధితులను ఒప్పిస్తారు. పక్కాగా జరుగుతోన్న ఈ కుట్రలో కొందరు షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు కలిసి పనిచేస్తున్నాయి. తర్వాత నకిలీ వైద్యం, ఫ్లైట్ పత్రాలు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బులు పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. తర్వాత బీమా సొమ్మును షెర్పాలు, హెలికాప్టర్ కంపెనీలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, నకిలీ పత్రాలు ఇచ్చిన ఆసుపత్రులు పంచుకుంటున్నాయని వెల్లడించారు. ఈ మోసం విలువ 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.186 కోట్లు) అని అంచనా వేశారు. పర్వతాల్లో సహాయక చర్యలు చేపట్టే సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లను ఈ ఏడాది జనవరిలో అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ (చీవజ్ఞుఖ్రీ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేపాల్ పర్యాటకంలో ఎంతో కీలకమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్ విషయంలో జరుగుతోన్న ఈ మోసాన్ని అక్కడి న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఈ నెట్‌వర్క్‌లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. కాగా.. పర్యాటకుల విషయంలో ఇలాంటి స్కామ్‌లు వెలుగుచూడటం ఇది తొలిసారేం కాదు. అందుకే ఈ మోసాల కారణంగా పలు అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. ఈ ఘటనలపై అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. కఠిన శిక్షలు లేకపోవడమే నేరాలు పెరగడానికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# డిజిటల్ జనగణన తొలిదశ ప్రారంభం

కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిజిటల్ పద్ధతిలో స్వీయ నమోదు ప్రక్రియ మొదలైంది. రాష్ట్రపతి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వయంగా జనగణన పోర్టల్‌లో తన కుటుంబ వివరాలను నమోదు చేశారు. 15 రోజులపాటు ఈ పోర్టల్ లేదా యాప్ సంబంధిత కేంద్రపాలిత, రాష్ట్రాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా తమ గృహ వివరాలను డిజిటల్ ప్రక్రియలో నమోదు చేశారు. "నేను నా వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేశాను. భారత ప్రజలు కూడా తమ గృహ వివరాలను నమోదు చేసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలి" అని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సారి జనగణన ప్రక్రియలో తొలిసారి స్వీయ నమోదును ప్రవేశపెట్టారు.

## మొదటి పేజీ తరువాయి

# రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

అంటూ హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. బిల్లుపై చర్చ జరిగిన సమయంలో రాజ్యసభ గ్యాలరీ నుంచి లోకేశ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బిల్లు ఆమోదం పొందాక, దీనికి సహకరించిన పలు పార్టీల ఎంపీలను ఆయన నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్యసభ క్యాంటీన్‌లో వారితో భేటీ అయ్యారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగాక ఆమోదం లభించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా కేంద్ర కేబినెట్ దీనికి పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి, రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి చట్టబద్ధత ప్రక్రియ పూర్తవుతుంది.

# నామినేషన్లు వేసేటప్పుడు జాగ్రత్త

ప్రయోజనాల కోసం కేంద్ర సంస్థలను భాజపా దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. మహిళలు భాజపాకు ఓటేయవద్దని పిలుపునిచ్చారు. 'వారు మహిళా వ్యతిరేకులు. అందుకే మహిళల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు' అని వ్యాఖ్యానించారు. సర్‌పై సుప్రీం కోర్టు పర్యవేక్షణను స్వాగతించారు. ఆ నిర్ణయం పట్ల సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. భాజపా నేతలు ప్రజల బ్యాంకు ఖాతాలను అడుగుతున్నారని, ఇవ్వవద్దని సూచించారు. 'ఇది భాజపా గేమ్‌ప్లాన్. ఎన్నికల ముందు ప్రజలకు డబ్బులిస్తారు. ఎన్నికల తర్వాత పిచ్చివాళ్లను చేస్తారు' అని మమత వ్యాఖ్యానించారు.

**హెలికాప్టరుకు గాలివానతో ఆటంకం**

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హెలికాప్టరుకు ఉరుములతో కూడిన గాలివాన కారణంగా ఆటంకం ఏర్పడి, బుధవారం ముర్షిదాబాద్ జిల్లాలోని నబగ్రామ్‌లో ఆమె ఎన్నికల ప్రచారం ఆలస్యమైంది. మధ్యాహ్నం బలమైన గాలులు వీస్తుండటంతో హెలికాప్టరు ల్యాండింగులో ఇబ్బంది తలెత్తింది. దీంతో వెనక్కుమళ్లి బుర్ద్వాన్ చేరుకున్న సీఎం అక్కడి నుంచి రోడ్డు మార్గాన నబగ్రామ్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గత వారం కూడా పశ్చిమ బర్ధమాన్ జిల్లాలోని అండాల్ నుంచి వచ్చిన మమత విమానం కోల్‌కతా విమానాశ్రయంలో దిగేందుకు ప్రయత్నించగా, ప్రతికూల వాతావరణం కారణంగా గంటకు పైగా ఆలస్యమైంది.

**బస్సు, ట్రక్కు ఢీకొని 40 మందికి గాయాలు**

నబగ్రామ్‌లో జరిగిన మమతా బెనర్జీ సభలో పాల్గొని తిరిగి వెళుతున్న కార్యకర్తలు ప్రయాణిస్తున్న బస్సు జాతీయ రహదారి-12 వద్ద ట్రక్కును ఢీకొనడంతో 40 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను పోలీసులు సమీప ఆసుపత్రికి తరలించారు.

# దుస్సాహసానికి పాల్పడితే.. పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ హెచ్చరిక

పరిస్థితులను ఆసరాగా చేసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఉగ్ర చర్యలపై గతంలో దీటుగా బదులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న వేళ రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ప్రస్తుత పరిస్థితుల్లో మన పొరుగు దేశం ఏవైనా కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చు. ఒకవేళ అదే జరిగితే.. భారత ప్రతిస్పందన ఊహించని రీతిలో, నిర్ణయాత్మకంగా ఉంటుంది. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించింది" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

# చంద్రుడి వద్దకు ఐఫోన్లతో వ్యోమగాములు.. చరిత్రలో తొలిసారిగా నాసా కీలక నిర్ణయం

అమలు చేస్తున్నారు. ఈ మిషన్ ద్వారా మానవసహిత యాత్ర 50 ఏళ్లకు పైగా విరామం తర్వాత చంద్రుడి సమీపంలోకి వెళ్తోంది. రీడ్ వైస్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెరెమీ హాన్సెన్‌లతో కూడిన నలుగురు వ్యోమగాముల బృందం, ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి రానుంది. ఈ ప్రయాణంలో తమ వ్యక్తిగత క్షణాలను, అద్భుతమైన దృశ్యాలను బంధించేందుకు వీరికి ఐఫోన్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. వ్యోమగాములు వినియోగించే పరికరాలను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్ ఈ ఏడాది ఆరంభంలో ప్రకటించారు. "మా వ్యోమగాములు తమ కుటుంబం కోసం ప్రత్యేక క్షణాలను బంధించుకోవడానికి, ప్రపంచంతో స్ఫూర్తిదాయకమైన చిత్రాలు, వీడియోలను పంచుకోవడానికి అవసరమైన సాధనాలను అందిస్తున్నాం" అని ఆయన గతంలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. అయితే, అంతరిక్ష నౌకలోని వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, డీప్ స్పేస్ ప్రయాణంలో ఈ ఫోన్లను పూర్తిగా 'ఏరోప్లేన్ మోడ్'లోనే ఉంచుతారు. అంటే ఇవి కేవలం హై-ఎండ్ కెమెరాలుగా మాత్రమే పనిచేస్తాయి. ప్రయాణ సమయంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం మీదుగా వెళుతున్నప్పుడు, అక్కడి వై-ఫైకి కనెక్ట్ అయి ఫొటోలు, ఈ-మెయిల్స్ పంపే అవకాశం ఉంటుంది. కానీ, వాయిస్ కాల్స్ చేసుకోవడం మాత్రం సాధ్యం కాదు. ఈ యాత్రలో వ్యోమగాములు చంద్రుడి ఉపరితలానికి సంబంధించిన లైవ్ చిత్రాలను తీయడంతో పాటు ఇంతకుముందు మానవ కంటికి కనిపించని కొన్ని ప్రదేశాలను గమనించనున్నారు. అలాగే, లోతైన అంతరిక్షం నుంచి పాక్షిక సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించనున్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో సంచలన తీర్పు

## ముగ్గురు నిందితులకు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష -ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్



**సిటిజన్ టైమ్స్ అనకాపల్లి జిల్లా : ఏప్రియల్ 02**

చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పదేళ్ల క్రితం నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో నిందితులకు కోర్టు కఠిన శిక్ష విధిస్తూ కీలక తీర్పునిచ్చింది. నేరం నిరూపితమైన ముగ్గురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. హరి నారాయణ తీర్పు వెల్లడించారు. 2016, అక్టోబర్ 13న చీడికాడ మండలం అప్పలరాజుపురం సమీపంలోని త్రిషింగ్ ఫ్లోర్స్ వద్ద సుమారు 300 కిలోల గంజాయిని అక్రమంగా తరలించేందుకు నిందితులు సిద్ధమయ్యారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి పది ప్లాస్టిక్ బస్తాలలో తరలిస్తుండగా, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై జి. అప్పారావు మరియు వారి సిబ్బంది మెరుపు దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. శిక్ష పడిన నిందితులందరూ చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన బొట్టా ఈశ్వరరావు (ఎ-1), గోకాడ తాతబాబు (ఎ-5), మరియు గోకాడ చెల్లు బాబు (ఎ-6). వీరిపై ఎన్ డి పి ఎస్ చట్టంలోని సెక్షన్ 20(బి )(సి) తీ/ష 8(సి) కింద నేరం రుజువు కావడంతో కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో నిందితులు అదనంగా మరో రెండేళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసెక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ వాదనలు వినిపించారు. పకడ్బందీగా దర్యాప్తు చేసిన నాటి ఎస్సై జి. అప్పారావును, కోర్టు మానిటరింగ్ సెల్ మరియు చీడికాడ పోలీసు సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసుల కృషిని, న్యాయస్థానం వెలువరించిన ఈ కఠిన తీర్పును ఎస్పీ స్వాగతించారు.

## సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం: పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్





**విశాఖ/ఋషికొండ ఏప్రియల్ 02**

నగరంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు విశాఖపట్నం పోలీసులు పలు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, ఋషికొండలోని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మాదకద్రవ్యాల నిరోధక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం పోలీస్, విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ వి.సి ఎస్.సి జేసీఐ వైజాగ్ పోర్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సదస్సుకు విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చీ , వి.సి ఎస్.సి ఛైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 9వ, 10వ తరగతులకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ బాగ్చీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే తీవ్ర అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలు మానవ మెదడు, శారీరక ఆరోగ్యంపై చూపే హానికర ప్రభావాలు, వ్యసనం వల్ల వ్యక్తిగత జీవితం, చదువు, భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందో తెలియజేశారు. కుటుంబ సంబంధాలు కూడా ఈ వ్యసనం కారణంగా ఎలా దూరమవుతాయో ఉదాహరణలతో వివరించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు 'ఈగిల్ హెల్ప్‌లైన్' టోల్-ఫ్రీ నంబర్‌తో పాటు తన వ్యక్తిగత మొబైల్ నంబర్ 7995095799ను పంచుకున్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం పోలీసులకు అందించినట్లయితే, ఆ సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో చొరవ చూపి పూర్తి సహకారం అందించిన సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యానికి, డైరెక్టర్ శ్రీనివాస్ పావులూరి, ప్రిన్సిపాల్ సునీత ఎర్నాగులలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువతను విద్యావంతులను చేయడంలోనే కాకుండా, విశాఖపట్నంలో మాదకద్రవ్యాల రహిత సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# ట్రాన్స్‌జెండర్‌లకు భరోసాగా నిలిచిన పోలీస్ కమిషనర్

**సిటిజన్ టైమ్స్ విశాఖ/ఎండాడ ఏప్రియల్ : 02**

సమాజంలో అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ విశాఖపట్నం సిటీ పోలీసులు మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్ కమీషనర్ శంఖబ్రత భాగ్చి ఆలోచనలో రూపుదిద్దుకున్న "జ్యోతిర్గమయ" కార్యక్రమం ట్రాన్స్ జండర్స్ జీవితాల్లో మార్పుకు నాంది పలుకుతోంది. సమాజంలో ట్రాన్స్ పర్సన్స్‌కు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల వారు సిగ్నల్ పాయింట్లు, షాపుల వద్ద భిక్షాటన చేయడం, కొన్నిసార్లు సామాన్యులతో వివాదాలకు దిగడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్న కమిషనర్, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ బి. భాస్కర్ రావు ఆధ్వర్యంలో ట్రాన్స్ జండర్స్, వారి గురువులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు, అవమానాలు, ఉపాధి లోపం వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేశారు. వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే సంకల్పంతో "జ్యోతిర్గమయ" కార్యక్రమాన్ని అమలు చేస్తూ, వారి విద్యార్హతలు, ఆసక్తులను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 40 మంది ట్రాన్స్ పర్సన్స్‌కు విశాఖ జి.వి.యం.సి పరిధిలో ఉపాధి కల్పించగా, మరో 20 మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా 6 మంది ట్రాన్స్ జండర్స్ కు బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించి, వారి చేత పాన్ షాప్, కిరాణా



షాపులు ఏర్పాటు చేయించారు. తాజాగా గురువారం ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 10 మందికి ఉపాధి కల్పించే విధంగా టీ డ టిఫిన్ సెంటర్‌ను ట్రాన్స్ పర్సన్స్ చేత ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించడమే కాకుండా, సమాజంలో వారికి ఉన్న ప్రతికూల దృక్కోణాన్ని




మార్చే దిశగా విశాఖ పోలీసులు ముందడుగు వేస్తున్నారు. "జ్యోతిర్గమయ" కార్యక్రమం వారికి కొత్త ఆశలు నింపుతూ, వారిని సమాజంలో ప్రధాన మార్గం లోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది అని చెప్పవచ్చు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ తీసుకుంటున్న సరికొత్త నిర్ణయాలకు ప్రజలు హర్షం చేస్తున్నారు.

# కలెక్టరేట్ విభాగాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**విశాఖపట్టణం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం ఉదయం కలెక్టరేట్లోని విభాగాలను పరిశీలించారు. ప్రతి సెక్షన్ కు వెళ్లి అక్కడ పరిస్థితులను గమనించారు. అక్కడి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. 24ల7 కంట్రోల్ రూమ్ ను సందర్శించి అక్కడే జరిగే ప్రక్రియను చూశారు. ఎలాంటి అంశాలపై ప్రజల నుంచి ఫోన్లు వస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల నమోదు, రికార్డుల నిర్వహణ, చర్యలపై ఆరా తీశారు. అదే ప్రాంగణంలో ఉన్న ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడ కొన్ని రకాల సూచనలు చేశారు. కార్యాలయ బోర్డు కాస్త పెద్దదిగా పెట్టాలని, అప్పుడే ప్రజలకు సులభంగా కనిపిస్తుందని చెప్పారు. అనంతరం డీఎస్వో కార్యాలయం, దాని వెనుక కొత్తగా నిర్మిస్తున్న హడ్కో భవనాన్ని, కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్, కలెక్టర్ పేషీని కూడా కలెక్టర్ పరిశీలించారు. సెక్షన్ల పరిశీలన సమయంలో కలెక్టరేట్ కారిడార్లో కనిపించిన వృద్ధులతో మాట్లాడారు. వారి ఫిర్యాదు కాపీలను చూసి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పీజీఆర్ఎస్, ఇతర సెక్షన్ల సందర్శనలో భాగంగా అక్కడున్న అధికారులకు, సిబ్బందికి పలు అంశాలపై సూచనలు చేశారు. ప్రజలను ఎక్కువ సేపు వెయిట్ చేయించొద్దని, త్వరితగతిన వారికి సమాధానం చెప్పి పంపాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు నిర్ణీత సమయంలోనే పరిష్కారం చూపాలన్నారు. అందరూ బాధ్యతగా వ్యవహరించి, ఎవరి పని వారు చక్కగా చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో సుధాసాగర్, కలెక్టర్ ఏవో బీవీ రాణి, ఇతర అధికారులు ఉన్నారు.

# అమరావతి చట్టబద్ధతపై గాజువాకలో సంబరాలు

## పల్లా నాయకత్వంలో టిడిపి శ్రేణుల సంబరాలు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించిన సందర్భంగా గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, పటాకులు పేల్చుతూ, నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం రాజధాని నిర్ణయం మాత్రమే కాకుండా, తెలుగుజాతి ఆత్మగౌరవానికి దక్కిన గౌరవమన్నారు. రైతుల త్యాగాలు, ప్రజల శాంతియుత పోరాటం ఫలితంగా ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. గత వైసీపీ పాలనలో అమరావతిని నిర్లక్ష్యం చేసి, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పల్లా విమర్శించారు. రాజధాని అంశంపై ప్రజలను అయోమయంలోకి నెట్టి అభివృద్ధిని అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు కేంద్రం స్పష్టంగా అమరావతిని చట్టబద్ధ రాజధానిగా గుర్తించడం ద్వారా అన్ని అనుమానాలకు తెరపడిందన్నారు. ఇకపై అమరావతి అజేయమని, రాష్ట్రానికి స్పష్టమైన గుర్తింపుగా నిలుస్తుందని పల్లా స్పష్టం చేశారు. రాజధాని విషయంలో అపోహలు, తప్పుడు ప్రచారాలను ప్రజలు




నమ్మవద్దని, అభివృద్ధి వ్యతిరేక శక్తుల మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అమరావతి బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి, కూటమి ప్రభుత్వ సంకల్పంతోనే ఈ చారిత్రాత్మక విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాజువాకలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు జరుపుకోవడం ప్రజల్లో అమరావతిపై ఉన్న విశ్వాసాన్ని మరోసారి స్పష్టంచేసిందని పల్లా శ్రీనివాసరావు అన్నారు.

# రక్షణ శాఖ మంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## ఏర్పాట్లపై సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ , ఏప్రిల్ 02 :**

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు కచ్చితంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తన ఛాంబర్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక సూచనలు చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యటన సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు అత్యంత కట్టుదిట్టంగా ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రోటోకాల్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి పర్యటనలో భాగంగా నావల్ డాక్‌యార్డ్‌లో ఐఎన్ఎస్ "తరగిరి" నౌక కమిషనింగ్ కార్యక్రమం, నావల్ సదుపాయాల పరిశీలన, నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లాబొరేటరీ సందర్శన వంటి కార్యక్రమాలు ఉన్నందున సంబంధిత విభాగాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలని కలెక్టర్



సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, రవాణా, మున్సిపల్, వైద్యారోగ్య, ఫుడ్ సేఫ్టీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చట్ట సభల్లో రాజధాని బిల్లు ఆమోదంపై 13 వార్డులో సంబరాలు

**అమరావతికి పట్టిన గ్రహణం వీడింది.**

**ప్రజా రాజధానికి పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత వచ్చింది.**

**వార్డు అధ్యక్షుడు ఏడువాక ఆధ్వర్యంలో సంబరాలు.**




**ఆరిలోవ, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

ఉభయ సభల్లో ఇందుకు సహకరించిన పార్టీలకు, నేతలకు, భారతదేశప్రజలకు కృతజ్ఞతలు తెలపడానికి ఈరోజు సాయంత్రం 7 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మన ఇళ్ల ముందు దీపాలు వెలిగించి 'మన రాజధాని అమరావతి'కోసం విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలు మేరకు 13వ వార్డ్ టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు అధ్యర్యంలో దీపహారతులు వెలిగించి ఆనందాలతో బాణాసంచా కాల్చడం చేయడం జరిగింది.అలాగే మోడీ కి చంద్రబాబు నాయుడు కి పాలాభిషేకం చేయడం జరిగింది. వార్డ్ ఆఫీస్ దగ్గర జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ అధికారి ప్రతినిధి పొత్రకొండ ధర్మారావు,,టీడీపీ ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న,కిల్లంశెట్టి శ్రీనివాసరావు, తూర్పు ఎస్సీ సెల్ అధ్యక్షులు పట్టా నూకరాజు, యూత్ అధ్యక్షులు వాడిసెలా శ్రీనివాస్,టీడీపీ నాయకులు, అడ్డురి రమణ, ఓశెట్టి గురుమూర్తి, చిత్తూరు సత్యనారాయణ, తదితరులు పాల్గున్నారు

# అమరావతి బిల్లు ఆమోదంపై సంబరాలు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 2**

అమరావతి రాజధాని బిల్లుకు లోక్ సభ సహా రాజ్యసభ ఆమోదం తెలియజేయడం పట్ల హర్షం ప్రకటిస్తూ.. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. బిల్లుకు మద్దతిచ్చిన దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ, ఆనందోత్సాహాల మధ్య బాణాసంచా కాల్చారు. అమరావతికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఆంధ్రుల కలల రాజధానికి చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలకు.. రైతుల త్యాగాలకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిక్కాల విజయ్ బాబు, పీవీ నరసింహం, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, లొడగల అప్పారావు, గరే గుర్నాథ్, నాగోతి సత్యనారాయణ, గరికిన ఎల్లయ్య (కింగ్), చెట్టుపల్లి సన్యాసిరావు, మామిడి దుర్గారావు, కానూరు అచ్యుతరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, పంచదార్ల శ్రీనివాస్, వాండ్రాసి అప్పలరాజు, బోయి రమాదేవి, పాసి త్రినాథ్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా వేసవి కార్యచరణ ప్రణాళిక అమలు చెయ్యాలి

**సమీష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దాం**

**జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేబాధ్యత అధికారులపై ఉంది**

**జిల్లా సమీక్ష కమిటీ (డి ఆర్ సి ) సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**







**అనకాపల్లి,(సిటిజన్ టైమ్స్ ) ఏప్రిల్ 02**

వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పకడ్బందీ గా వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు చెయ్యాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా కమిటీ ( డి ఆర్ సి ) సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగింది. త్రాగు నీరు, ఎల్ నినో, విద్యుత్, రహదారుల, మున్సిపాల్ శాఖల పై ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పెందుర్తి, వి మాడుగుల ఎమ్మెల్యే లు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యన్నారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ల తో కలిసి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పక్క ప్రణాళిక తో అమలు చెయ్యాలన్నారు. జిల్లాలో కనీసం ఒక్క గ్రామం లో కూడ త్రాగు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకువాలని, ఎల్ నినో ప్రభావం మన జిల్లాలో ఉంటుంది గనుక సంబందించిన శాఖ ల వారు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా అదకారులందరు సమానవ్యం చేసుకొని స్వర్ణంధ్ర 2047 లక్ష్య సాధనకై కృషి చెయ్యాలన్నారు. ఇటీవల నక్కపల్లి లో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమాన్ని ఘన విజయం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ ధన్యవాదాలన్నారు. బడ్జెట్ ఔట్ రీచ్ కార్యక్రమంలో చర్చించిన మేరకు అవగాహన కల్పించండి. రాష్ట్రాన్ని 2047 లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. అధికారులు కూడా బాగా పని చేయాలి. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పని చేయాలి. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్ర తలసారి ఆదాయ. తక్కువ ఉందన్నారు. తలసారి ఆదాయం లో మన జిల్లా మరింత వెనుకబడి ఉందన్నారు. జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, వినియోగంలోకి తీసురావాలన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాను వ్యవసాయ రంగం తోపాటు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి బాటలో నిలిపేవిధంగా నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక పార్క్ లు ఏర్పాటుచేసి ఔత్సాహిక పారిశ్రమికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలోనూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సమీష్టి కృషితో అభివృద్ధి పథంలో అనకాపల్లి జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచేందుకు తాము శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. రైతాంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి కూడా సమిష్టి కృషి చేస్తామన్నారు. పేదప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ముఖ్యంగా వేసవి దృష్ట్యా త్రాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యన్నారాయణ రావు, సీపీవో జి. రామారావు, నర్సీపట్నం,అనకాపల్లి ఆర్డీఓలు వివి రమణ, షేక్ అయిషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి చట్ట బద్దత ఆమోదంతో

# 11 వార్డులో సంబరాలు

**కేక్ కట్ చేసి, ర్యాలీ చేసిన ఎమ్ఎస్ఎమ్ఈ రాష్ట్ర డైరెక్టర్ ముగడ రాజారావులి**





**ఆరిలోవ, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

రాష్ట్ర ఎమ్ఎస్ఎమ్ఈ డైరెక్టర్ గ్రేటర్ విశాఖ 11 వార్డు అధ్యకుడు ముగడ రాజారావు అమరావతి రాజధాని బిల్లుకు లోక్ సభ సహా రాజ్యసభ ఆమోదం తెలియజేయడం పట్ల హర్షం ప్రకటిస్తూ.. బిల్లుకు మద్దతిచ్చిన దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. వార్డు లో బాలాజీ నగర్ సాయిబాబా ఆలయం వద్దపార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి,అమరావతికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఆంధ్రుల కలల రాజధానికి చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర ప్రజలకు.. రైతుల త్యాగాలకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ రాగతి అచ్యుత్ రావు, రేఖ జ్యోతి,మూతి అప్పారావు,కాకి గంగరాజు, మరియు సి ఓ అరుణ్ కుమార్,వార్డు ఆర్ పి లు, తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదకరమైన టిబి వ్యాధిని దేశం నుంచి తరిమికొట్టాలి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 2**

ప్రమాదకరమైన క్షయవ్యాధి(టిబి) ని కూకటి వ్రేళ్ళతో పెకిలించి మన దేశం నుంచి తరిమి కొట్టాలని ఫిషర్ మ్యాన్ కాలని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ సాయి చరణ్ పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని ఎంవిపి కాలని రైతుబజార్లో జిల్లా క్షయ నివారణ కార్యక్రమము వారి ఆధ్వర్యంలో డి.టి.సి. టీబి యూనిట్ పరిధిలో టీబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ మార్గ దర్శకాల గురించి వివరించారు. రెండు వారాలకు మించి విడవకుండా వచ్చే తీవ్ర దగ్గు, రక్తంతో కూడిన కఫం, కారణం లేకుండా బరువు తగ్గి పోవడం, శ్వాస సులువుగా ఆడక పోవడం, తరచుగా సాయంత్రం పూట జ్వరం రావడం, రాత్రి చెమటలు పట్టడం, ఆకలి తగ్గిపోవడం తదితర అనారోగ్యకర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుని సంప్రదించి తగిన వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఈ విషయాలన్నింటిలోనూ ప్రజలందరిని భాగస్వామ్యం చేసి ప్రజలందరికి క్షయ వ్యాధి పట్ల అవగాహనా కల్పించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నా మన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వటం వలన క్షయ వ్యాధిని సులువుగా సమూలంగా నిర్మూలయించ వచ్చున్నారు. రైతు బజారులోని రైతులకు, వినియోగదారు లకు ఈ మేరకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులను ఈ వ్యాధి స్క్రీనింగ్ చేశారు. ఈ కార్యక్రమం లో రైతు బజార్ ఎస్టేట్ అధికారి కె. వరహాలు సహాయకుడు జి.కనరాజు, రైస్ కౌంటర్ మురళి, సత్యనారాయణ, బాలమ్మ, రాము, దేముడు, కనకరావు, కమల, సునీత అశావర్కర్ పావని, నాగమణి, సావిత్రి, మరియు రైతులు, వినియోగ దారులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధాని గుర్తింపుగా కలెక్టరేట్‌లో విద్యుత్ వెలుగులు

**కాకినాడ, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 02**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ పార్లమెంటు ఆమోదించిన సందర్భాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో రంగవల్లు, విద్యుత్ అలంకరణలతో వేడుకలు నిర్వహణ ఘనంగా జరిగాయి.కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ నందు జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్ సిబ్బందితో కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




# అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం ఆంధ్రులకు పండుగ దినం

**పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు**





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**


ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపిన ఈరోజు ఆంధ్రులందరికీ పండగ రోజు అని, ఈ గొప్ప విజయాన్ని అందించిన ప్రధాని నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రజలందరూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు , నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తల లు కాగడాల ప్రదర్శన చేస్తూ అరసత్వనాలు వ్యక్తం చేశారు రాజధాని బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడంతో పెందుర్తి కూడలిలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. కాగడాలు వెలిగించి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ సమర్ధుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధాని సాధించుకోగలిగామనీ, ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ దీపావళి, సంక్రాంతి వంటి పండగ అని పేర్కొన్నారు. దేశంలోని పార్టీలన్నీ అమరావతికి మద్దతు తెలిపితే జగన్ మాత్రం మోకాలడ్డడానికి కుట్రలు చేశారని మండిపడ్డారు. పార్లమెంట్లో విచిత్రమైన ధోరణి ప్రదర్శిస్తూ ఆ పార్టీ దేశ ప్రజలందరిలోనూ ఛీత్కారానికి గురైందని విమర్శించారు. ప్రపంచంలోనే మూర్ఖపు ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. అమరావతి రాజధానిగా శాశ్వతంగా నిలిచి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "నగరంలో అంబరాన్నంటిన అమరావతి రాజధాని సంబరాలు"

**పార్లమెంటులో అమరావతి ఏపీకి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత వచ్చిన వేళ ఆనంద వేడుకలు.**

**ప్రజలు, విద్యార్థులు, యువత,అధికారులు, మహిళలలో ఉప్పొంగిన సంతోషం.**


**-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడంతో ప్రజల్లో అపార ఆనందాన్ని నింపిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయ సాధనకు అనుగుణంగా అమరావతి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత వచ్చిన సందర్భంగా నగరంలో అమరావతి రాజధాని సంబరాలు ఘనంగా జరిగాయని,ఈ ఘనతకు జీవీఎంసీ పరిధిలో గురువారం సాయంత్రం ప్రజలు, విద్యార్థులు, యువత,అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు,మహిళలలు, జోనల్ కమిషనర్లు, సచివాలయాల సిబ్బంది ఆనందంతో ఉప్పొంగుతూ ఈ చారిత్రాత్మక విజయాన్ని ఘనంగా జరుపుకున్నారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా గురువారం తెలియజేశారు. నగరంలో క్యాండిల్ ర్యాలీలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి సంబరాలు చేపట్టారన్నారు. నగరంలో గల అన్ని జీవీఎంసీ జోనల్ కార్యాలయాలలో సచివాలయాల పరిధిలో అధిక సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు ఈ వేడుకలలో పాల్గొని రంగురంగుల ముగ్గులను అలంకరించి , దీపాలతో అమరావతి రాజధానికి స్వాగతిస్తూ ఆనందోత్సాహం పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారన్నారు. యువత బైక్ ర్యాలీలు చేపట్టారన్నారు. అమరావతి రాజధానిగా అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ నగరంలో సంబరాలు కొనసాగాయని కమిషనర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆనంద వేడుకలలో జోనల్ కమిషనర్లు , ఉన్నతాధికారులు, ఎస్ ఎస్ జి మహిళలు, ఆర్పీలు, సచివాలయాల సిబ్బంది, జీవీఎంసీ అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సత్య దేవుని ఆలయంలో విశేషంగా చైత్ర పౌర్ణమి!



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

పూర్ణ మార్కెట్ ఇసుక కొండ పై వేంచేసియున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో చైత్ర పౌర్ణమి గురువారం నాడు వైభవంగా జరిగింది . శ్రీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం నరసింహచార్యులు స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు , అర్చనలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు . భక్తులందరూ క్యూ కాంప్లెక్స్ ద్వారా ధ్వజస్తంభాన్ని మ్రొక్కి అనంతరం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు. మూడు బ్యాచ్ లలో మొత్తం 120 వ్రతములు జరిగాయి. వ్రతంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రం, స్వామి వారి ఫోటో, నూక ప్రసాదం అందజేసి వేద ఆశీర్వచనం చేశారు . శ్రీమన్నారాయణ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది. 1000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది.



## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖ పర్యటన



**విశాఖపట్నం, ఏప్రిల్ 2,సిటిజన్ టైమ్స్**

భారత ప్రభుత్వ రక్షణ శాఖా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం విశాఖపట్నం లో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. 3 వ తేదీ ఉదయం న్యూఢిల్లీ నుండి బయలుదేరి మధ్యాహ్నం 11:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుండి నావల్ డాక్‌యార్డ్‌కు వెళ్లి మధ్యాహ్నం 12:20 గంటల నుండి 1:30 గంటల వరకు ఐఎన్ఎస్ "తరగిరి" నౌక కమిషనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3:00 నుండి 4:00 గంటల వరకు నావల్ సదుపాయాలను పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 4:15 నుండి 5:00 గంటల వరకు నావల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లాబొరేటరీ ను సందర్శిస్తారు. సాయంత్రం 5:15 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి రాత్రి న్యూఢిల్లీకి చేరుకుంటారు.

## మన రాజధాని అమరావతికి దీప హారతులు



**రామచంద్రాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ చేసే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. ఈ శుభ సందర్భంగా రామచంద్రపురం మండలం హసన్ బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు "మన రాజధాని అమరావతి"కి దీపహారతులు ఇద్దాం! అనే కార్యక్రమంతో దీపాల ప్రదర్శన నిర్వహించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని సాకారం చేసిన ప్రధాని మోదీ కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలన అద్భుతం





**ఎన్టీఆర్ జిల్లా:( సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 02**

ఎన్టీఆర్ జిల్లా, ఏ కొండూరు మండలంలోని గ్రామాలు రేపూడి తండా, ఏ కొండూరు తండా గ్రామ కార్యదర్శులు వై. కోటిరెడ్డి, రామ కిషోర్, మాట్లాడుతూ ఆయా పంచాయతీలలో, డ్రైనేజీలు ఉన్నాయి, కానీ ఇంకా కొన్ని డ్రైనేజీలు కావాలని తెలిపారు. సిసి రోడ్లు, వీధి దీపాలు పెన్షన్ల, ఇంటి పన్నుల గురించి వివరణ ఇచ్చారు. గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ అద్భుతంగా పనిచేస్తుందని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. గ్రామాలలోనే కాకుండా రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి మరోవైపు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని అనడం జరిగింది. గ్రామీణ పంచాయతీరాజ్ శాఖ నుంచి వచ్చిన నిధుల గురించి వాటిని వేటికి ఉపయోగించారు పేర్కొన్నారు. ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని అనడం జరిగింది.

# ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించాలి

## జిల్లా వ్యవసాయ అధికారి రామారావు





**అమలాపురం సిటిజన్ టైమ్స్,ఏప్రిల్ 2**

వర్షాభావ పరిస్థితులను ఎ ల్ నినో సవాళ్లను ఎదుర్కొంటూ సీడ్ టు సీడ్ దిశగా ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.వి. రామారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీ కళా గ్రాండ్ నందు మూడు రోజులపాటు నిర్వహించిన రైతు సాధికార సంస్థ ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ సీజన్-2026 సన్నద్ధతపై శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఖరీఫ్ సీజన్ లో పి.ఎం.డి.ఎస్ విధానం ద్వారా 'సీడ్ టు సీడ్' విత్తనం నుండి విత్తనం వరకు కార్యక్రమాన్ని అమలు చేయడం అనేది ప్రకృతి వ్యవసాయం లో ఒక విప్లవాత్మకమైన ముందడుగు అన్నారు. ముఖ్యంగా వర్షాధారిత ప్రాంతాల్లో తక్కువ నీటితో, భూమిని సారవంతంచేస్తూ పంటలు పండించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సాధారణంగా రైతులు వర్షాలు పడిన తర్వాతే పొలం దుక్కి చేసి విత్త నాలు వేస్తారని, పి ఎం డి ఎస్ విధానంలో వర్షాలు పడకముందే పొడి నేలలో విత్తనాలు విత్తు తారన్నారు ?విత్తన గుళిక లు విత్తనాలను ఘన జీవామృతం, మట్టి, ఆవు పేడతో కలిపి చిన్న చిన్న గుళికలు గా చేసి చల్లుతారన్నారు. గాలిలో ఉన్న తేమను గ్రహించి విత్తనం మొలకె త్తడానికి వీలుగా భూమిపై మల్చింగ్ చేస్తారన్నారు.

సీడ్ టు సీడ్ కార్యక్రమం ఈ విధానంలో రైతు తన పొలంలో విత్తనం వేసినప్ప టి నుండి, మరలా విత్తనం పొందే వరకు పూర్తి స్థాయి లో ప్రకృతి పద్ధతులనే పాటిస్తారన్నారు.?వైవిధ్యభరిత మైన పంటలు కేవలం ఒకే రకమైన పంట కాకుండా, ఏకకాలంలో 15 నుండి 20 రకాల విత్తనాలను కలిపి చల్లుతారన్నారు.?365 రోజుల పచ్చదనశీ తో భూమిని ఎప్పుడూ ఖాళీగా ఉంచకుండా, నిరంతరం ఏదో ఒక పంట ఉండేలా చూడటం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.20 వేల మంది రైతులను పూర్తి స్థాయి ప్రకృతి వ్యవసా యంలోకి మార్చడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహించామన్నారు. జిల్లా ఖరీఫ్ 2026 సీజన్‌ను పురస్కరించు కుని, జిల్లా లో ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా 3రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా ముగి సాయన్నారు జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన, మరియు గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొని ప్రకృతి వ్యవసాయ సన్నద్ధతపై దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఎల్ నినో ప్రభావంతో ముందస్తు ప్రణాళిక రూపకల్పన చేయడం జరిగిందన్నారు, 2026-27 సంవత్సరంలో ఎల్ నినో ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు సూచిస్తున్నాయన్నారు. ఈ వాతావరణ మార్పుల నుంచి వరి, కొబ్బరి వంటి పంటలను కాపాడుకోవడా నికినవధాన్యాల సాగు ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు.మట్టిలో తేమను నిలిపి ఉంచడానికి, జీవ వైవిధ్యం పెంచడానికి ప్రతి రైతు చేత నవధాన్యాల సాగు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 20 వేల మంది రైతులతో సీడ్ టు సీడ్' విప్లవం తీసుకురా వాలన్నారు ఈ ఏడాదిని సీడ్ టు సీడ్ సంవత్స రంగా ప్రకటించిన ట్లు తెలిపారు. జిల్లాలో 20,000 మంది రైతులను రసాయన రహిత సాగులో కి మళ్లించి, వారు స్వయం గా విత్తనాలను ఉత్పత్తి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. దీనివల్ల రైతులకు పెట్టు బడి ఖర్చు తగ్గి, నికర ఆదాయం పెరుగుతుందన్నారు. శాఖల మధ్య సమన్వయంతో కీలక నిర్ణయాలు శిక్షణ కార్యక్ర మాలలో తీసుకున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసా యం చేసే రైతులకు, ముఖ్యంగా పి ఎం డి ఎస్ సాగు కు అవసరమైన రుణాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మహిళా మార్టుల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా ఉద్యాన అధికారి బి.వి.రమణ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రధాన పంటలైన కొబ్బరి, అరటి తోటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమలు చేసేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవ సాయానికి అవసరమైన కషాయాలు, జీవ ఉత్ప్రేర కాలను రైతులకు అందుబా టులో ఉంచేందుకు జిల్లా లోని బయో రిసోర్స్ సెంటర్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారన్నారు.జిల్లా వ్యాప్తంగా రైతులకు అవ గాహన కల్పించి, ఖరీఫ్ 2026లో ప్రకృతి వ్యవసా యాన్ని విజయవంతం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ శిక్షణ కార్య క్రమంలో ఏడీఏలు ఏడీపీఎం, మండల వ్యవసాయ అధికారులు ఏపీఎంలు ఉద్యాన అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.




# భూ కబ్జాదారులపై ఉక్కు పాదం మోపిన పెందుర్తి ఎమ్మార్వో

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02**

పెందుర్తి రెవెన్యూ పరిధిలోని పాపురాజుపాలెం శివ గాయత్రీ నగర్ లో సర్వేనెంబర్ 27 లో గల ప్రభుత్వ భూమి సుమారుగా 150 గజాలు ఆక్రమణకు గురైంది. దీనిపైన ఫిర్యాదులందుగా, రెవెన్యూ అధికారులు,ఆక్రమించిన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో వెంకట అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే మరియు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకుంటూ ఆ భూమిని స్వాధీన పరుచుకుంటామని తెలిపారు. పెందుర్తి మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణ గురవుతున్న తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని ప్రజలందరికీ పత్రికాముఖంగా తన ఫోన్ నెంబర్ను కూడా ఇచ్చారు. నేరుగా తనకు ఫోన్ చేసిన మరియు వాట్సప్ చేసినా కూడా పిర్యాదుదారుల అడ్రస్ ఎక్కడ




తెలియజేయకుండా, ఆకలి ఉండదారులపై కట్టించరు తీసుకుంటావని ప్రభుత్వ భూములు రక్షిస్తామని తెలిపారు.

# అమరావతి బిల్లు ఆమోదంతో అల్లవరంలో మిన్నంటిన సంబరాలు

## - కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేసిన ఎన్డీఏ కూటమి నాయకులు



**అల్లవరం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 02**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభ రాజ్యసభలు చారిత్రాత్మక ఆమోదం తెలపడంపై అమలాపురం నియోజకవర్గవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు, అల్లవరం మండల కేంద్రంలోని మార్కెట్ వద్ద ఎన్డీఏ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు భారీ కేక్ కట్ చేసి, ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,5కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అమరావతిని ఏకైక రాజధానిగా నిలబెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రాజధాని రైతులకు న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి కార్యకర్తలు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. "జై అమరావతి - జై హింద్" నినాదాలతో మార్కెట్ పరిసర ప్రాంతాలు మారుమోగాయి.

## మన రాజధాని అమరావతి ప్రత్యేక రంగోలి కమిషనర్ వి.నిర్మల్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి భారత ప్రభుత్వం పార్లమెంటులో చట్టబద్దతను కల్పించిన సందర్భంగా గురువారం సాయంత్రం అమలాపురం పురపాలక సంఘం కార్యాలయ ప్రాం గణంలో "మన రాజధాని అమరావతి"తో ప్రత్యేక రంగోళిని అలం కరించి, దీపాలు వెలిగించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అమలా పురం పురపాలక సంఘం కమీషనరు వి.నిర్మల్ కుమార్ గఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కమీషనరు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది దీపాలను వెలిగించి, మన రాజదాని అమరావతికి దీప హారతులు ఇచ్చి, దీపాలతో సెల్ఫీ తీసుకుని ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి కి చట్టబద్ధత రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలంతా తమ ఇంటి వద్ద పండగలా జరుపుకోవాలని కమీషనర్ వి.నిర్మల్ కుమార్ పిలుపునిచ్చారు.

## శ్రీ జగన్మోహిని ఆలయంలో శిలాఫలకం ఆవిష్కరించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు

**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

2027 - పుష్కర పనులలో భాగంగా ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు గల శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ శంఖుస్థాపన మహోత్సవమునకు కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు విచ్చేసి, శిలాఫలకమును ఆవిష్కరించారు.శ్రీ జగన్మోహిని కేశవ - గోపాల స్వామి వారి క్షేత్రపాలకులు శ్రీ గోపాల స్వామి వారి రాజగోపురం శిలాఫలకమును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెర్ల నాగేశ్వరరావు, శ్రీ జగన్మోహిని కేశవ- గోపాల స్వామి వారి దేవస్థానం ఛైర్మన్ నామాల శ్రీనివాసు, శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, ఛైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామంలో ఇతర ఆలయ ఛైర్మన్లు ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామపెద్దలు, గ్రామస్థులు, భాగవతుల వెంకటరమణ మూర్తి, కార్యనిర్వాహణాధికారి మరియు ఆలయ అర్చకులు, ఆసాదులు, వేదపండితులు మరియు ఆలయ సిబ్బందిలి తదితరులు పాల్గొన్నారు.



# రాజధాని అమరావతి చట్టబద్ధతపై సంబరాలు





**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ముమ్మిడివరం నియోజకవర్గంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ ప్రధాన కేంద్రం ముమ్మిడివరం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల లో కేక్ కట్ చేసి,ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని, మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన దీపాల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుండి నగర పంచాయతీ ప్రధాన రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి, గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ ర్యాలీ పార్టీ కార్యాలయం నుండి బయలుదేరి ముమ్మిడివరం నగర పంచాయతీ అంతా విశేష జనవాహిని మధ్య కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ, అమరావతిని ఏకైక రాజధానిగా అభివృద్ధి చేయాలనే సంకల్పానికి పార్లమెంటులో చట్టబద్ధత రావడం రాష్ట్ర చరిత్రలో ఒక కీలక ఘట్టమని తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందడంలో సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేస్తున్న కృషికి ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూర్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాకినాడ కలెక్టర్‌ని మర్యాదపూర్వక కలిసిన ఎమ్మెల్యే రాజప్ప



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్2**

గురువారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాల చిన్న రాజప్ప, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసారు.

## అమరావతి రాజధాని చట్టబద్ధతపై అమలాపురం నియోజకవర్గంలో మిన్నంటిన సంబరాలు




**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 02**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఉభయ సభల్లో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా, అమలాపురం నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు, అమలాపురం నియోజకవర్గం పేరూరు వై-జంక్షన్ వద్ద కూటమి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించి చట్టబద్ధత కల్పించడం ద్వారా ఐదు కోట్ల ఆంధ్రుల కలలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిజం చేశారని కొనియాడారు. రాజధాని రైతులకు న్యాయం జరిగిందని, రాష్ట్ర భవిష్యత్తుకు ఇది ఒక శుభసూచకమని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి పార్టీల కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జంక్షన్ వద్ద బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి జై అమరావతి,జై కూటమి అంటూ నినాదాలు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గంగవరం పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన పల్లా...

### మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 02:**

గాజువాక నియోజకవర్గం గంగవరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిస్థితులు, విద్యాబోధనపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం సరిగా లేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తరువాత ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించి, సరైనదని నిర్ధారించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా లీప్ యాప్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని పల్లా సూచించారు. విద్యార్థుల భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, ఫిర్యాదులు లీప్ యాప్ ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఐవీఆర్ఎస్ ద్వారా కూడా తరచూ తల్లిదండ్రుల ఫీడ్‌బ్యాక్ సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం లేదా ఎటువంటి తప్పిదం జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, హాజరు వివరాలు, మౌలిక వసతులు, పరిశుభ్రతపై కూడా పల్లా సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి మెరుగైన విద్యను అందుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే నాణ్యతతో కూడిన విద్య, సదుపాయాలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

## “మీ భూమి - మీ హక్కు” కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

దెందులూరు మండలం మేదిన రావు పాలెం గ్రామంలో 680 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ.

ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా “మీ భూమి - మీ హక్కు కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

ఎలాంటి దెయ్యం బొమ్మలు లేకుండా ప్రభుత్వ రాజముద్రలతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను సగర్వంగా అందిస్తున్నాము

**దెందులూరు:( సిటిజన్ టైమ్స్ ):ఏప్రిల్ 02**

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, రైతులకు పూర్తిస్థాయి భూ హక్కులను కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం దెందులూరు మండలం మేదినరావుపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినమీ భూమి - మీ హక్కుకార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం సిద్ధం చేసిన 680 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలపంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికార యంత్రాంగం పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యేచింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో రీ-సర్వే నిర్వహించి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ తగాదాలను పరిష్కరించడం, రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి, తప్పులు లేని పాస్ పుస్తకాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం, కొత్త పాస్ పుస్తకాల ద్వారా రైతులకు బ్యాంక్ రుణాలు పొందేందుకు మరియు భూ విక్రయ/కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, రైతులకు తమ తాతలు , కుటుంబీకుల నుంచి వచ్చిన భూములపై గత వైసిపి ప్రభుత్వం లో దెయ్యం బొమ్మలు ముద్రించి ఇచ్చారని, ఇది రైతుల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని, అందువల్లనే రైతు పక్షపాతి అయిన కూటమి ప్రభుత్వం వారి ఆత్మ గౌరవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో కాలయాపన చేసిందని, కానీ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే



రైతులకు భరోసా కల్పిస్తూ రికార్డు కాలంలో రీ-సర్వేను పూర్తి చేసి పాస్ పుస్తకాలు అందజేస్తోందని తెలిపారు. అన్నదాత సుఖీభవ” నినాదంతో రైతుల భూములకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శక పద్ధతిలో ఈ పంపిణీ జరుగుతోందని స్పష్టం చేశారు..ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసి పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. లిఅనంతరం దెందులూరు మండలంలో నూతనంగా మంజూరైన స్పౌజ్ క్యాటగిరి ఫించనులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మండల పార్టీ సెక్రటరీ నాగనబోయిన సత్యనారాయణ, తహశీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో ప్రతాప్, క్లస్టర్ ఇంచార్జ్ పరస వెంకటరావు, కూటమి నాయకులు కమ్మ శివరామ కృష్ణ, సొసైటీల చైర్మన్లు గారపాటి కొండయ్య చౌదరి, డాక్టర్ పసుమర్తి మధు, యలమర్తి వీర వెంకట సత్యనారాయణ, యలమర్తి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు గారపాటి రంగారావు, వెన్నమనేని రాజా సహా పలువురు కూటమి నాయకులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచులు అవుట్

### ప్రత్యేక అధికారులు ఇన్



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం లో గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తో పూర్తయిందని, దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 47 ప్రకారం సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లుగా ఎంపీడీవో జీ.వీ.సరోవర్ తెలిపారు. దీంతో సర్పంచులు అవుట్, ప్రత్యేక అధికారులు ఇన్ అయ్యారు .అయినవిల్లి మండలంలో గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి..,అయినవిల్లి, విలస,మడుపల్లి ,ఎస్.మూలపొలం గ్రామాలకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి, నేదునూరు,మాగం, అయినవిల్లి లంక,నల్లచెరువు గ్రామాలకు అయినవిల్లి తాసిల్దార్, కే.జగన్నాథపురం ,వీరవల్లి పాలెం, చింతనలంక గ్రామాలకు మండల విద్యాశాఖ అధికారిబి2, శానపల్లి లంక గ్రామమునకు వ్యవసాయాధికారి, కొండుకుదురు, పొట్టిలంక గ్రామాలకు ఆర్టికల్చర్ అధికారి,తొత్తరమూడి వెలువలపల్లి ,ఎన్.పెదపాలెం గ్రామాలకు సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో, సిరిపల్లి ,క్రాప,శంకరయ్య గూడెం ,పోతుకుర్రు గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీరాజ్ వార్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడినవని,రేపటి నుండే గ్రామపంచాయతీ పరిపాలన వ్యవహారాలను చూస్తారని,కాబట్టి గ్రామపంచాయతీ పరిపాలన పై చెప్పిన ప్రత్యేక అధికారుల ఆధీనంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జరుగునని ఎంపీడీవో జీ.వి. సరోవర్ తెలిపారు.

# ప్రజారాజధానిగా అమరావతి

– అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

– రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టం – 1600 రోజుల పోరాటం... రైతులు, మహిళల దీక్షకు గౌరవం

– మూడు రాజధానుల గందరగోళం... రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన గత పాలన

– సీఎం చంద్రబాబు దూరదృష్టి... ప్రపంచ స్థాయి అమరావతి నిర్మాణం

– పీఎం మోదీ సంకల్పం... వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది



**అమరావతి,:( సిటిజన్ టైమ్స్ ):ఏప్రిల్ 02:**

అమరావతి చట్టబద్ధత బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, ఇది రైతుల త్యాగాలకు న్యాయం చేసిన చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ప్రజారాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని ఇచ్చి దేశంలోనే అరుదైన ఉదాహరణగా నిలిచారని తెలిపారు. 1600 రోజుల పాటు నిరంతర పోరాటం చేసిన రైతులు, మహిళల ఉద్యమానికి ఆయన సెల్యూట్ చేస్తూ, ఉద్యమ సమయంలో మహిళలను సైతం వదలకుండా జరిగిన దాడులు ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచాయని తీవ్రంగా ఖండించారు. గత 12 ఏళ్లుగా రాజధానిపై కొనసాగిన అస్పష్టత రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపిందని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని రాజధాని లేకుండా చేసిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వైసీపీ అమరావతికి మద్దతు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిన వైఖరిని ప్రజలు గట్టిగా ఎదుర్కొన్నారని, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చెందేందుకు పునాది పడిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం రాష్ట్ర అభివృద్ధికి బలమైన దిశను చూపుతోందని తెలిపారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదని, ఇది ఐదుకోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, రైతుల త్యాగాలకు ప్రతీక అని స్పష్టం చేశారు. రాజధానిపై ఎమ్మెల్యే జగన్ వక్రబుద్ధి ఎప్పటికీ మారదని, రాష్ట్రానికి న్యాయం చేస్తారనే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శిస్తూ, ‘మావిగన్’ వంటి ప్రతిపాదనలు ఆయన చంచల వైఖరికి నిదర్శనమని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం గత ప్రభుత్వ వైఫల్యాలకు గట్టి సమాధానంగా నిలిచిందని పేర్కొన్నారు. అమరావతి గ్రామాలైన తుళ్లూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి తదితర ప్రాంతాల్లో రైతులు, మహిళలు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకోవడం ప్రజల ఆనందానికి నిదర్శనమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి సువర్ణ భవిష్యత్ అందిస్తుందని, అమరావతి నిత్యశాశ్వత రాజధానిగా నిలుస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

## అమరావతి బిల్లుతో టీడీపీకి కొత్త ఉత్సాహం

### దీపాలు, బాణాసంచా మధ్య కూటమి నేతల వేడుకలు..

**అమలాపురం సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 2**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం లభించడంతో అమలాపురంలో తెలుగుదేశం పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద ఘనంగా కూటమి నేతలు సంబరాలు నిర్వహించారు.లి ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలుపుతూ కూటమి నేతలు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు, కూటమి నేతలు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తప్పనిసరి: ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

## సాంకేతికతతో కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి - అధికారులకు దిశానిర్దేశం





**సిటిజన్ టైమ్స్ శ్రీకాకుళం సిటీ : ఏప్రిల్ 02**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, బాధితులకు తక్షణ సహాయం, అలాగే ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు అత్యవసరమని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, డ్రోన్ల మరియు ఆధునిక సాంకేతిక అప్లికేషన్ల వినియోగం, కేసుల పురోగతి, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో సమాచారం నమోదు వంటి అంశాలపై ఆయన సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రమాదాలకు దారితీసే కారణాలను ముందుగానే గుర్తించి, తగిన చర్యలు అమలు చేస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాల అమలును కఠినంగా పర్యవేక్షించాలని, ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి వెంటనే సరిచేయాలని, రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల తర్వాత తొలి గంటను "గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని, ఈ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందితే ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ పేర్కొన్నారు. అందువల్ల ప్రమాద బాధితులకు వెంటనే సహాయక చర్యలు అందేలా చూడాలని సూచించారు. అలాగే కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని పేర్కొన్న ఆయన, స్మార్ట్ పోలీసింగ్ ద్వారా అసాంఘిక మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు నేరాల నియంత్రణలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలని, ప్రతి కేసును సమయపాలనతో పూర్తి చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

## మండలాలలో పంచాయితీలకు స్పెషల్ అఫీసర్ల నియామకం...

**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్సు, ఏప్రిల్ 2**

గురువారం నుండి పంచాయితీల పదవీ కాలం ముగిసి పోవడంతో సఖినేటిపల్లి మండల పరిదిలో పంచాయితీలకు డా.బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరు ఆదేశాలతో స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. సఖినేటిపల్లి తహసీల్దారు ఎం. వెంకటేశ్వరరావును సఖినేటిపల్లి గ్రామంతో పాటు, సఖినేటిపల్లి లంక, టేకిశెట్టిపాలెం గ్రామ పంచాయితీలకు స్పెషల్ ఆఫీషరుగా నియమించగా, సఖినేటిపల్లి ఎంపీడీఓ రాజ్ కుమార్ ను అంతర్వేదిపాలెం, రామేశ్వరం, సఖినేటిపల్లి లంక గ్రామలకు, సఖినేటిపల్లి ఎం.ఈ.ఓ-1 డి.కిషోర్ కుమార్ ను కేశవదాసుపాలెం, శ్రుంగవరప్పాడు గ్రామాలకు, సఖినేటిపల్లి ఎం.ఈ.ఓ-2 ఎం.వెంకటేశ్వరరావును అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలకు, మండల అగ్రికల్చరల్ ఆఫీషరు సరిపల్లి రాకేష్ ను గొంది, గుడిమూల గ్రామాలకు, డిప్యూటీ ఎంపీడీఓ కె.సూర్యనారాయణను మోరి, మోరిపోడు, వుయ్యూరివారిమెరక గ్రామలాకు స్పెషల్ ఆఫీషర్లుగా నియమించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

## మండల గ్రామ సర్పంచులకు పదవీ విరమణ కార్యక్రమం



**పెద్ద తిప్ప, సిటిజన్ టైమ్సు, ఏప్రిల్ 2**

పెద్ద తిప్ప సముద్రం మండలం ఎంపీడీవో కార్యాలయం నందు మండల గ్రామ సర్పంచులకు పదవీ విరమణ కార్యక్రమం జరిగింది మండలంలో 20 మంది సర్పంచులు ఉండగా వారిలో పదిమంది సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులుగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని గ్రామాభివృద్ధిలో మీ వంతు మీరు సహకారం అందిస్తూ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి ఐదు సంవత్సరాలు పని చేశారు ఇలాంటి అవకాశం అందరికీ రాదు . మీరు ఇంకా కష్టపడి గ్రామాలనే కాదు మండలాన్ని కూడా మీ అందరి సహకరించి అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాను తర్వాత మల్లెల గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి చేయాలంటే పదం ఉంటేనే కాదు పదవి లేకున్నా ఒకరికొకరు సహకారంతో గ్రామాన్ని పల్లెలను మండలాన్ని కూడా అభివృద్ధి చేయవచ్చును ఈ ఒక విషయాన్ని గుర్తు పెట్టుకుంటే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కృషిచేసి గ్రామాలనే కాకుండా మండలాన్ని కూడా అభివృద్ధి చేయవచ్చునని తన తోటి సర్పంచులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమానికి ఎక్స్ జెడ్పిటిసి ఈశ్వరప్ప సింగల్ విండో డైరెక్టర్ కిట్టన్న బోర్లపల్లి సుధాకర్ రెడ్డి పంచాయతీ సెక్రటరీలు కార్యాలయ సిబ్బంది ఆర్డబ్ల్యూఎస్ చంద్ర తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.

# ఆంధ్రప్రదేశ్‌లో రోయింగ్‌కు బూస్ట్

### సూర్యలంక, విజయవాడ, విశాఖలో ప్రధాన సెంటర్లు.

### రాష్ట్రం పర్యాటకంగా అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

### రాష్ట్ర స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. తరుణ్ కాకాని.



**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :02:**

రాష్ట్రంలో రోయింగ్ క్రీడ అభివృద్ధికి కీలకమైన సమావేశం విజయవాడలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. తరుణ్ కాకాని, రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బాలాజీ మారడపా, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భారణి కలిసి రాయింగ్ క్రీడను అభివృద్ధి చేయడం గురించి చర్చించారు. ఈ సమీక్షలో, సూర్యలంక, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో మూడు ప్రధాన రోయింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, జంగారెడ్డిగూడెంలో అదనపు కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు జరిగాయి. రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరఫున పడవలు, కోచ్‌లు మరియు సాంకేతిక సహాయం అందిస్తామని బాలాజీ మారడపా హామీ ఇచ్చారు. సమావేశం ముగిశాక, ఆయన ఎస్.భారణిని సన్మానించారు. అనంతరం డా. తరుణ్ కాకాని మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుండి జిల్లా స్థాయి ఎంపికలు ప్రారంభమవుతాయని, ఆ తరువాత ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రోయింగ్ క్రీడను జాతీయ స్థాయికి తీసుకెళ్తానని ఈ సమావేశం కీలక ముందడుగు అని ఆయన గుర్తు చేశారు.

# జిల్లాలోని రైతులకు డివిడెండులు విడుదల చేసిన కొమరాగిరిపట్నం మెట్లరామమూర్తి సహకార సంఘం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

సహకార సంఘం డివిడెండులు విడుదల చేయడంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతులకు సేవలు అందించిన సంఘం అంబేద్కర్ కోనసీమజిల్లా కొమరాగిరిపట్నం మెట్లరామమూర్తి ప్రాథమిక సహకార సంఘం,రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సుమారుగా 303 సంఘాలు,అంబేద్కర్ కోనసీమజిల్లా 166 సంఘాలు ఉండగా రైతులకు షేరు ధనంపై వడ్డీ (డివిడెండు)విడుదల చేసిన మెట్లరామమూర్తి సహకార సంఘం అని రైతులు తెలిపారు 108 సంవత్సరలు చరిత్రగల సహకార సంఘంగా నిలిచిన ఎక్కైక సంఘం మెట్లరామమూర్తి సహకార సంఘం అని పలువురి తెలిపారు. ఏకగ్రీమంగా సంఘం ఎర్పడిన ప్పటి నుండి మెట్ల వంశీయులు ఈనాటివరకు సారధ్యం వహిస్తున్నారు రాష్ట్రంలో ఏ ప్రారంతంలోని లేని విధంగా కొమరాగిరిపట్నం గ్రామంలో 2 సహకార సంఘలు కలిగి ఉండి గ్రామంలో మెట్లరామమూర్తి సహకార సంఘమే ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఉంటూ రైతులకు అందుబాటులో పనిచేస్తున్నారు రైతులకు సబ్సిడి పై ఎరువులు, పశువుల దాన, వాటర్ ప్లాంట్, అందుబాటులో ధ్యానం కొనుగోలు, రేష్ను షాప దీర్ఘ కలిక అప్పులు ఎల్ టి ,లోన్ డిపాజిట్ సేకరణ, ఆర్.బి లు (సేవింగ్ ఖాతాలు) రైతులకు అందుబాటులో ఈ సంఘం ఉన్నదాని చుట్టు పక్కల గ్రామలో కామర్షియాల్ బ్యాంకులు ఉన్నప్పటికి ఈ సంఘం అందుబాటులో ఉండుట వలన చిన్న, పెద్ద రైతు లు ఈ సంఘలో పొదుపు ఖాతాలు జరిపించుకోవటంలో రైతులు కొనియాడారు.



# అర్హులకు నూతన పెన్షన్లు అందజేయాలి

### కలెక్టర్ ను కోరిన డాక్టర్ షేక్ మహబూబ్ వలీ



**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న నూతన పెన్షన్లు మంజూరు చేయకపోవడం దారుణమని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలీ అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో పేద, మధ్యతరగతికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా చెరుకు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ రెహనాభాను, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, ఉమ్మడి ప్రకాశం జిల్లా మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ అబ్దుల్లా మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గిద్దలూరుకు మరో కొత్త రైల్






Apr 01 2026 (20:24) India Rail Info 1

IMG20732-2214582/Secunderabad Nandyal Intercity SF Express

SC/Secunderabad Jn to NDL/Nandyal Jn

Type: SuperFast Zone: SCR

IMAGINARY TRAIN by Koushik009

8h 5m - 444 km - 11 halts - Departs Daily

| # | Code | Station Name | Arr | Dep | Halt | PF | Day | Km | Spd | Elv | Zone |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | SC | Secunderabad Jn | | 05:45 | | | 1 | 0 | 46 | 536 | SCR |
| 2 | CHZ | Charlapalli | 06:01 | 06:03 | 2m | | 1 | 12 | 72 | 525 | SCR |
| 3 | NLDA | Nalgonda | 07:24 | 07:25 | 1m | | 1 | 110 | 75 | 226 | SCR |
| 4 | MRGA | Miryalaguda | 07:55 | 07:56 | 1m | | 1 | 148 | 74 | | SCR |
| 5 | NDKD | Nadikude Jn | 08:27 | 08:28 | 1m | | 1 | 186 | 71 | | SCR |
| 6 | PGRL | Piduguralla | 08:46 | 08:47 | 1m | | 1 | 207 | 25 | 106 | SCR |
| 7 | NLPI | Nemalipuri | 09:17 | 09:18 | 1m | | 1 | 220 | 54 | | SCR |
| 8 | RPCA | Rompicharla | 09:42 | 09:43 | 1m | | 1 | 242 | 53 | | SCR |
| 9 | VKN | Vinukonda | 10:14 | 10:15 | 1m | | 1 | 269 | 72 | 83 | SCR |
| 10 | MRK | Markapur Road | 11:06 | 11:07 | 1m | | 1 | 331 | 71 | 160 | SCR |
| 11 | CBM | Cumbum | 11:29 | 11:30 | 1m | | 1 | 357 | 75 | 196 | SCR |
| 12 | GID | Giddalur | 11:57 | 11:58 | 1m | | 1 | 390 | 29 | | SCR |
| 13 | NDL | Nandyal Jn | 13:50 | | | | 1 | 444 | - | 211 | SCR |

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

సికింద్రాబాద్ ‍శీ నంద్యాల, నంద్యాల్ ‍శీ సికింద్రాబాద్ నూతన రైలు ప్రారంభం కానున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. సికింద్రాబాద్ నుంచి నల్లగొండ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ మార్కాపురం, కంభం గిద్దలూరు, నంద్యాల వరకు సూపర్ ఫాస్ట్ ఇంటర్సిటీ రైలు ప్రవేశపెట్టనున్నారు. తిరుగు ప్రయాణంలో నంద్యాల్ ‍శీ సికింద్రాబాద్ చేరుతుంది ఈ రైలు. సికింద్రాబాద్లో ఉదయం 5 గంటల 45 నిమిషాలకు బయలుదేరి గిద్దలూరు కు12.ూ6 గంటలకు వస్తుంది, తిరుగు ప్రయాణంలో గిద్దలూరు కు 3:15 నిమిషాలకు బయలుదేరి సికింద్రాబాద్ కు రాత్రి 10 గంటల 40 నిమిషాలకు చేరుతుంది. ఈ రైలు ఇంటర్సిటీగా సూపర్ ఫాస్ట్ తో ప్రతి రోజు నడుస్తుంది.

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

### సంతృప్తి వ్యక్తం చేసిన కేవీఎన్ఎల్ జెడ్ పి హెచ్ ఎస్ ఉపాధ్యాయులు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 2**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారం మండల కేంద్రమైన సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు రత్నం జూనియర్ కళాశాల విద్యార్థుల కేరింతల నడుమ ప్రశాంతంగా ముగిసినట్లు శీలంవారిపల్లి కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాల ఉపాధ్యాయులు సుబ్బయ్య, మధు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలు ఎటువంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించారని, విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారని తెలిపారు గత సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా మా పాఠశాలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో భాగంగా సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పూర్తి చేసిన చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, డిపార్ట్మెంట్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పరీక్షలు సజావుగా ముగియడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొడుతూ ఒకరినొకరు అభినందించుకుంటూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు.





# 'సర్దార్ 2' తెలివైన పని..అంచనాలు పీక్స్ లో!



ప్రస్తుతం భారతీయ చిత్ర పరిశ్రమలో స్పై థ్రిల్లర్ సినిమాల హవా నడుస్తోంది. -ధురంధర్- రిలీజ్ అయిన దగ్గర నుంచి -ధురంధర్ 2- రిలీజ్ పై ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసారు. ఈ మధ్య కాలంలో ఏ సినిమా రిలీజ్ కోసం ప్రేక్షకులు అంతగా ఎదురు చూసింది లేదు. -ధురంధర్- రిలీజ్ పైనే సర్వత్రా చర్చ జరిగింది. ఆ రకంగా ధురంధర్ అనే స్పై సినిమా ప్రేక్షకుల్లో ఎంత బలమైన ప్రభావాన్ని చూపించిదన్నది అంచనా వేయొచ్చు. ఇటీవలే రిలీజ్అయిన -ధురంధర్ ది రివేజ్- ఎంత పెద్ద విజయాన్ని నమోదు చేసిందో తెలిసిందే. దీంతో స్పై సినిమాల గ్రాఫ్ అంతకంతకు మార్కెట్ లో పెరిగింది.

ఒకప్పుడు స్పై సినిమాలంటే కేవలం బాలీవుడ్ మార్కెట్ కే పరిమితమయ్యేవి. కానీ నేడు సీన్ మారింది. పాన్ ఇండియాలో స్పై కథకు ప్రేక్షకులకు అంతే కనెక్ట్ అవుతున్నారు. -ధురంధర్ 2- 1000 కోట్ల క్లబ్ లో వారం వ్యవధిలో చేరడమే అందుకు ఉదాహరణ. గూఢచారి వ్యవస్థ, దేశభక్తి ,హై-వోల్టేజ్ యాక్షన్ అంశాలకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సానుకూల వాతావరణం ఇప్పుడు కోలీవుడ్ స్టార్ కార్తీ నటిస్తోన్న -సర్దార్ 2- చిత్రానికి కొండంత అండగా నిలవబోతోంది. ఇది నిజంగా చిత్ర యూనిట్ తీసుకున్న అత్యంత తెలివైన నిర్ణయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో -సర్దార్- మొదటి భాగం విడుదలైనప్పుడు తమిళంలో మంచి విజయం సాధించినప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అప్పట్లో స్పై సినిమాలపై ప్రేక్షకులకు ఉన్న అవగాహన , ఆసక్తి పరిమితంగా ఉండటమే అందుకు కారణం. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. -ధురందర్- సిరీస్ తర్వాత స్పై స్టోరీలలోని లోతును, ఆ ఉత్కంఠను తెలుగు జనాలు బాగా ఓన్ చేసుకుంటున్నారు. ఈ క్రేజ్ -సర్దార్ 2- అంచనాలను అప్పుడే పీక్స్‌కు తీసుకెళ్లింది. దర్శకుడు పి.ఎస్. మిత్రన్ -సర్దార్ 2-ను మొదటి భాగం కంటే రెట్టింపు బడ్జెట్ భారీ యాక్షన్ సన్నివేశాలతో తెరకెక్కిస్తున్నారు. -గూఢచారి-గా కార్తీ పర్ఫార్మెన్స్ ఈసారి మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. -ధురందర్ 2- విజయం అందించిన ఊపుతో? తెలుగు పంపిణీదారులు కూడా -సర్దార్ 2- రైట్స్ కోసం భారీగా పోటీ పడుతున్నట్లు సమాచారం. స్పై జోనర్‌కు ఇప్పుడున్న డిమాండ్‌ను బట్టి చూస్తే? ఈ సినిమాకు తెలుగులో భారీ ఓపెనింగ్స్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే కొన్నాళ్ల పాటు సినిమా ఇండస్ట్రీలో స్పై సినిమాల హవానే నడుస్తుంది. ప్రేక్షకులు ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు , అంతర్జాతీయ కుట్రల నేపథ్యంలో సాగే కథలను ఇష్టపడుతున్నారు. ఐరన్ వేడిగా ఉన్నప్పుడే దెబ్బ కొట్టాలన్న సామెతలా స్పై సినిమాల ఫీవర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ఈ జానర్ చిత్రాలను చేసి కాసులు చేసుకోవచ్చు.



## అప్పుడేమో కేఎల్ రాహుల్, ఇప్పుడు రిషబ్ పంత్‌ను ఘోరంగా అవమానించిన లక్నో ఓనర్




లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, తన జట్టు ఆటగాళ్లతో వ్యవహరించే తీరు మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ ఉన్నప్పుడు ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి, స్టీవ్ స్మిత్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించిన సంజీవ్ గోయెంకా. ఆ తర్వాత 2024 సీజన్‌లో స్టేడియంలోనే కేఎల్ రాహుల్‌ని తిట్టడంతో వివాదాల్లో నిలిచాడు. అయినా అతని పద్ధతిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో లక్నో ఓడిపోయిన తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌పై అతడు సీరియస్ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకి ఆలౌట్ అయ్యింది. సమీర్ రిజ్వీ హాఫ్ సెంచరీతో ఈ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలోనే ఢిల్లీ ఛేదించింది. ఆరంభంలో లక్నో బౌలర్లు వెంటవెంటనే 4 వికెట్లు తీసినప్పటికీ.. సమీర్ రిజ్వీ ( 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు) , ట్రిస్టన్ స్టబ్స్ ( 32 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సులతో 39 పరుగులు) కలిసి 119 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ని సక్సెస్ ఫుల్ గా ముగించేశారు.

**రిషబ్ పంత్‌తో సీరియస్ చర్చలు:**

ఈ ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌తో గ్రౌండ్‌లో సీరియస్‌గా చర్చించడం కెమెరాల్లో కనిపించింది. వాళ్లేం మాట్లాడుకున్నారో వినిపించకపోయినా సంజీవ్ , రిషబ్ పంత్‌కి ఏదో చూపిస్తూ సీరియస్‌గా చెప్పడం, దానికి అతను ముఖం చిన్నబుచ్చుకోవడం నెట్టింట వైరల్ గా మారిన వీడియోల్లో కనిపిస్తుంది. జట్టు పర్ఫామెన్స్ కారణంగా సంజీవ్ గోయెంకాకి కోపం రావడంలో తప్పు లేదు, కానీ ఇలా గ్రౌండ్‌లోకి వచ్చి మరీ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ని ఘోరంగా అవమానించడం మాత్రం కరెక్ట్ కాదని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. రూ.27 కోట్లు పెట్టి కొనుగోలు చేశామని.. ఎన్ని తిట్టినా భరించాలని అనుకునే కార్పరేట్ పద్ధతి, జెంటిల్మెన్ గేమ్ క్రికెట్‌కి సెట్ కాదనే విషయాన్ని సంజీవ్ గోయెంకా గుర్తు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**గతంలో కేఎల్ రాహుల్‌ని తిట్టిన సంజీవ్:**

2024 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, 165 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కొట్టిన కొట్టుడికి ఈ లక్ష్యాన్ని 9.4 ఓవర్లలోనే ఊదేసింది సన్‌రైజర్స్. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, స్టేడియంలోనే అప్పటి లక్నో టీమ్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ని తిట్టడం సంచలనంగా మారింది.

**సంజీవ్ గోయెంకా తీరుపై విమర్శలు:**

ఈ ఘటన తర్వాత క్రికెట్ అభిమానులు, మాజీ క్రికెటర్లు అందరూ కూడా సంజీవ్ గోయెంకా తీరుని తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బులు పెట్టినంత మాత్రాన, అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్లేయర్‌ని ఇలా మైదానంలో ప్రేక్షకులందరి ముందు చివాట్లు పెట్టి, అవమానించడం మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో బ్యాడ్ అయిపోవడంతో కేఎల్ రాహుల్‌ని ఇంటికి పిలిచి, డిన్నర్ ఏర్పాటు చేసి సంజీవ్ గోయెంకా 'సారీ' చెప్పగా.. అందరి ముందు తిట్టి, ప్రైవేటుగా సారీ చెబితే చెల్లిపోతుందా? అందుకే ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్‌ని వీడి, ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీ ఆఫర్ చేసినా గత అనుభవం కారణంగానే సారథ్య బాధ్యతలు తీసుకోవడానికి కేఎల్ రాహుల్ ఇష్టపడలేదు. 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 57 పరుగులు చేసి, ఢిల్లీ క్యాపిటల్స్‌ని విజయం అందించాడు. మ్యాచ్ తర్వాత సంజీవ్ గోయెంకా మాట్లాడడానికి ప్రయత్నించినా.. రాహుల్ పట్టించుకోకపోవడం కెమెరాల్లో కనిపించింది. కానీ ఈసారి సంజీవ్ గోయెంకా తీరు మార్చుకోకపోతే రిషబ్ పంత్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి జంప్ కావడం ఖాయమంటూ ఐపీఎల్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు.. వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!



దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరపున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు."గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరపున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరపున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది. అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరపున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

## 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం.. 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్



భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు."మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు.అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776